సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 5 । జూలై । 2024



రైతుల అభిప్రాయాలు పంపుతాం
రైతు భరోసా, రైతు బీమా పథకాలపై కర్ష కుల అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి పంపుతామని డీఏవో భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.
- 9లో ▸



సాయంలో జాప్యం
కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు సాయం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. డబ్బులకోసం ఏడాదిన్నర నిరీక్షించాల్సి వస్తోంది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /23.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పోచారం ప్రాజెక్టు పరిశీలన




నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టును గురువారం కామారెడ్డి, మెదక్ జిల్లాల అధికారులతో కలిసి ఎకో టూరిజం ఐఎఫ్ఎస్ అధికారి రంజిత్‌నాయక్ పరిశీలించారు. ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గల అనుకూల అంశాలపై ఆయన ఆరా తీశారు. స్థానిక అధికారులతో మాట్లాడి ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలతో పాటు ప్రాజెక్టు మధ్యలోనున్న ఐలాండ్, అభయారణ్యం తదితర వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ విద్యావతి, డీఈఈ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లిలో సెంట్రల్ లైటింగ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గురువారం ప్రారంభించారు. దేవునిపల్లి హైస్కూల్ నుంచి దేవి విహార్ వరకు డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసిన ఏడాది కావస్తోంది. అయితే విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఈ అంశంపై ఇటీవల 'సాక్షి'లో ఫొటోస్టోరీ ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, కౌన్సిలర్లు కాసర్ల గోదావరి, పోలీస్ కృష్ణాజీరావు, పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశి, నాయకులు రవి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



జాడలేని వానలు

- మృగశిరలోనూ మండిన ఎండలు
- ఆరుద్రలోనూ కరుణ చూపని వరుణుడు
- భారీ వర్షాలు లేక రైతుల్లో ఆందోళన
- వానాకాలం పంటల సాగుపై సందిగ్ధత

సాక్షి, కామారెడ్డి: వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచాయి. ఈ సీజన్‌లో అక్కడక్కడా జల్లులు తప్ప భారీ వర్షాలు కురియలేదు. సాధారణంగా మృగశిర, ఆరుద్ర కార్తెల్లో భారీ వర్షాలు కురుస్తాయి. కానీ ఈసారి మృగశిర కార్తె కలిసిరాలేదు. ఆరుద్రలోనూ అదే పరిస్థితి నెలకొంది. నేటితో ఈ కార్తె కూడా కరిగిపోతుంది. రేపటినుంచి పునర్వసు కార్తె ప్రారంభమవుతుంది. ఇప్పటికీ భారీ వర్షాలు ఒక్కటీ కురవకపోవడంతో ఖరీఫ్‌పై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. జూన్ మాసంలో 144.8 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 128 మి.మీ. వర్షమే కురిసింది. జూలైలో బుధవారం నాటికి 23.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 14.9 మి.మీ. వానే పడింది. మృగశిర అనుకూలించకపోయినా ఆరుద్ర కార్తెలోనైనా భారీ వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయ్యింది.

అనుకూలించని కాలం

సాధారణంగా మృగశిర, ఆరుద్ర కార్తెలలో విత్తనాలు వేస్తుంటారు. ఈ రెండు కార్తెల్లో జోరు వానలు కురిసి, ఒర్రెలు పారితే చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు వచ్చి చేరేది. అయితే ఈసారి ఆ రెండు కార్తెలలోనూ భారీ వర్షాలు పడలేదు. ఇప్పటి వరకు గట్టి వర్షం కురవకపోవడంతో భూమి పూర్తి స్థాయిలో తడవకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఆరుతడి పంటలకు సంబంధించి విత్తనాలు వేసినా వర్షాలు లేకపోవడంతో మొలకలు రాలేదు. తర్వాత జల్లులు కురవడంతో రెండోసారి కూడా విత్తనాలు వేశారు. అక్కడ ఈ వారంలో వర్షాలు కురవకుంటే ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు పేర్కొంటున్నారు.

లోటు వర్షపాతమే..

జిల్లాలోని సగానికిపైగా మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. చిరుజల్లులే తప్ప ఎక్కడా భారీ వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికీ భూమి కూడా పూర్తి స్థాయిలో తడవలేదు. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసినా అది నీళ్లు పారేంత స్థాయిలో లేకపోవడంతో అంతటా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పాల్వంచ, బీబీపేట, బాన్సువాడ, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, గాంధారి, మాచారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, భిక్కనూరు, దోమకొండ, లింగంపేట, జుక్కల్, పెద్దకొడప్‌గల్, మద్నూర్ తదితర మండలాల్లో సరైన వర్షాలు కరవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐదారు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ అక్కడ కూడా ఇబ్బందికర పరిస్థితులే ఉన్నాయి. చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదు. ప్రాజెక్టుల పరిస్థితి కూడా అలాగే ఉంది.

భూగర్భ జలాలు పెరగక..

వానాకాలం సీజన్ మొదలై నెల రోజులు దాటినా భారీ వర్షాలు కురవకపోవడంతో బోరుబావులు కుదురుకోలేదు. గతేడాది సరైన వర్షాలు లేకపోవడంతో యాసంగి సీజన్‌లో చాలా బోర్లు ఎత్తిపోయాయి. భారీ వర్షాలు కురిస్తేగానీ భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి ఊటలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కీలకమైన కార్తెలు కరిగిపోయిన నేపథ్యంలో రైతులు వానాకాలం సీజన్‌పై సందిగ్ధంలో పడ్డారు. విత్తనాలు వేసి నష్టపోయే కన్నా నాలుగు రోజులు వేచిచూద్దామనే ధోరణితో ఉన్నారు. దీంతో జిల్లాలో పంటల సాగు ముందుకు సాగడం లేదు.

లూప్‌లైన్ టు ఠాణా!

- ఎస్‌హెచ్‌వో స్థానాలపై ఆసక్తి
- ప్రయత్నాల్లో పలువురు ఎస్సైలు
- నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీ



కామారెడ్డి క్రైం: పని ఒత్తిడిని తట్టుకోలేక లూప్‌లైన్‌లోకి వెళ్లిన పలువురు ఎస్సైలు ప్రస్తుతం ఠాణాలకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. ఠాణాల్లో పోస్టింగ్ కోసం ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనుల్లో బిజీ అయ్యారు. త్వరలోనే ఎస్సైల బదిలీలు నిర్వహించే అవకాశం ఉండడంతో జోరుగా పైరవీలు చేసుకుంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో పోలీసు శాఖకు పని భారం పెరిగింది. ఓవైపు సిబ్బంది కొరత.. మరోవైపు ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు.. ఇంకోవైపు వీవీఐపీల పర్యటనల నేపథ్యంలో బందోబస్తు.. దీంతో ఉన్నవారిపైనే అదనపు భారం పడింది. రాజకీయ నేతల ఒత్తిళ్లు సైతం ఎక్కువగా ఉండడంతో చాలా మంది అధికారులు ఠాణాలకు ఎస్‌హెచ్‌వోలుగా పనిచేయడానికి నిరాసక్తత చూపారు. చాలా మంది పైరవీలు చేసుకుని మరీ ఎస్బీ, ఇంటెలిజెన్స్, డీసీఆర్‌బీ, ఐటీ లాంటి ఇతర లూప్‌లైన్ విభాగాలకు వెళ్లిపోయారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. అంతగా రాజకీయ ఒత్తిళ్లు, మితిమీరిన బందోబస్తు డ్యూటీలు ఇప్పుడు లేవు. దీంతో లూప్‌లైన్‌లో ఉన్న అధికారులు ప్రస్తుతం ఠాణాలకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

బదిలీలకు అవకాశం..

కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ఎస్సైలకు త్వరలో స్థానచలనం జరగనుంది. వారి స్థానాల్లో పోస్టింగ్‌ల కోసం జోరుగా ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి డివిజన్‌కు సంబంధించి మాచారెడ్డి, భిక్కనూరు, పట్టణ, దేవునిపల్లి ఎస్సైలు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఇతర డివిజన్ల కంటే ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఓ పార్టీ ఉండగా ఇక్కడ ఎమ్మెల్యే మరో పార్టీకి చెందిన వారు. దీంతో చాలా సందర్భాల్లో పోలీస్ స్టేషన్లకు వచ్చే కేసుల విచారణ, పరిష్కారాలు చూపడం ఎస్‌హెచ్‌వోలకు తలనొప్పిగా మారుతుందని పోలీసు అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఇక్కడి నుంచి మరేదైనా డివిజన్‌కు బదిలీ చేసుకోవాలని కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం. ఇది కాకుండా చాలామంది ఎస్సైలు ఎంపీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. వారిలో కొందరు తమ సొంత జిల్లాలకు వెళ్లిపోనున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని తాడ్వాయి, లింగంపేటలలో ఎస్‌హెచ్‌వోలు మారే అవకాశాలున్నాయి. బాన్సువాడలో ఇద్దరు పోలీసు అధికారులు బదిలీ కావచ్చని తెలుస్తోంది. దీంతో ఆయా స్థానాలలో పోస్టింగ్ కోసం లూప్‌లైన్‌లో ఉన్నవారు ప్రయత్నాలు చేసుకుంటున్నారని సమాచారం. పలువురు అధికారులు తమకు నచ్చిన పోస్టింగ్‌ల కోసం నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నా

కామారెడ్డి టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అన్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగ విరమణ చేయించడం దారుణమన్నారు. తక్షణమే ఉద్యోగ విరమణకు సంబంధించిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు విజయ, సరిత, జయప్రద, భాగ్యమ్మ, భారతమ్మ, రమాదేవి, అనసూయ, ఎలిజబెత్, భారతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



ఎకో టూరిజంకు ప్రణాళిక

- ఎస్సారెస్పీ నుంచి బాసరకు బోటింగ్ కోసం ఏర్పాట్లు
- ఎకోటూరిజం, సరస్వతి అమ్మవారి దర్శన ప్యాకేజీ సౌకర్యం!
- అటవీ అభివృద్ధి, పర్యాటక శాఖల ద్వారా ఏర్పాటుకు నిర్ణయం
- పర్యాటకంతో జిల్లాలో ఉపాధి అవకాశాలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది. జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతంలో పర్యాటకుల కోసం సౌకర్యాలు కల్పించే ప్రాజెక్టుకు అధికారులు రూపకల్పన చేస్తున్నారు. ఎకోటూరిజంతో పాటు బోటింగ్ ద్వారా బాసరలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయ సందర్శన సైతం టూరిజం ప్యాకేజీలో పెట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలోని అవకాశమున్న ప్రాంతాల్లో ఎకోటూరిజం సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతంలో సందడి చేసే జింకలు, నెమళ్లు, నక్కలు, కుందేళ్లు, విదేశీ వలస పక్షులను చూసేందుకు పర్యాటకుల కోసం తగిన సౌకర్యాలు కల్పించే ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు ఇప్పటికే విడతలవారీగా పరిశీలన చేస్తూ వస్తున్నారు.

- బాల్కొండ, నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లోని జలాల్‌పూర్, ఉమ్మెడ, గాదేపల్లి, జీజీ నడ్కుడ గ్రామాల వద్ద బోటింగ్ పాయింట్, రెస్టారెంట్లు, రిసార్టులు, వ్యూ పాయింట్ల ఏర్పాటు కోసం స్థలాలను పరిశీలించారు. డ్రోన్ సర్వేకు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 2023 జూలైలో 26 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.
- పర్యాటలకు రాత్రి బస కోసం డొంకేశ్వర్ మండలం గాదేపల్లి వద్ద 18 ఎకరాలు, నందిపేట మండలం ఉమ్మెడ వద్ద గెస్ట్ హౌజ్‌ల కోసం 5 ఎకరాలు, బోటింగ్ పాయింట్ల కోసం బాల్కొండ మండలం జలాల్‌పూర్ వద్ద 3 ఎకరాలు కేటాయించేందుకు నిర్ణయించారు. దీనికోసం గతంలో అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు పరిశీలన చేశారు.
- ఎకోటూరిజంతో పాటు బోటింగ్ ద్వారా బాసరలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయ సందర్శన సైతం టూరిజం ప్యాకేజీలో పెట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు.

అయితే భూసేకరణ విషయంలో మాత్రం ఇప్పటివరకు ఒక స్పష్టత రాలేదు. ఇదిలా ఉండగా వన్యప్రాణులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, తమ ప్రాంతంలో పర్యాటక సొబగులను కాపాడుకునేందుకు గాను గ్రామస్తులకు తగిన అవగాహన కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఎస్ఆర్, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో..

టూరిజం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నిధుల సేకరణ విషయంలో ప్రత్యేకంగా ఆలోచనలు చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ సంస్థ ద్వారా కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా జంగిల్ లాడ్జెస్, జంగిల్ రిసార్ట్స్ లను నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు గాను అటవీ, పర్యాటక శాఖలకు సంబంధించి నిధులు అందించే పథకాలను సైతం పరిశీలిస్తున్నారు. మరోవైపు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా నిధులను ఖర్చు చేసేందుకు సైతం ప్రణాళికలు తయారు చేస్తున్నారు. మరో ఆప్షన్ కింద పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా నిధులు సమకూర్చుకొని పర్యాటక అభివృద్ధికి యోచన చేస్తున్నారు. జిల్లా ప్రజలు సైతం శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో ఎకోటూరిజం అభివృద్ధి చేయాలని బలంగా కోరుతున్నారు. చెప్పుకోదగిన అంశం ఏమిటంటే శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ఏరియాలోని గ్రామాల ప్రజలు తమతో సమానంగా జింకలు, నెమళ్లను, ఇతర వన్యప్రాణులను సంరక్షించుకునే విషయంలో ప్రత్యేక ఆసక్తి చూపుతూ వస్తున్నారు. ఇక్కడ ఎవరైనా సరే వన్యప్రాణులను వేటాడే ఆలోచన చేసినప్పటికీ ఈ గ్రామాల ప్రజలు సహించరు. ఎకోటూరిజం అభివృద్ధి చెందితే తమ ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

ఇక జెడ్పీలో 'ప్రత్యేక' పాలన

- ముగిసిన జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం
- ప్రత్యేకాధికారిగా కలెక్టర్ సంగ్వాన్ నియామకం



జెడ్పీచైర్‌పర్సన్ దఫేదార్ శోభతో జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా పరిషత్ సిబ్బంది

సాక్షి, కామారెడ్డి: జిల్లా పరిషత్ పాలక వర్గం పదవీ కాలం గురువారంతో ముగిసింది. దీంతో చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులందరూ మాజీలయ్యారు. ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తర్వాత తొలి పాలక వర్గం ఎన్నికలు 2019 జూన్‌లో జరిగాయి. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ సీట్లు దక్కడంతో చైర్‌పర్సన్‌గా నిజాంసాగర్ జెడ్పీటీసీ సభ్యురాలు దఫేదార్ శోభ, వైస్ చైర్మన్‌గా బీబీపేట జెడ్పీటీసీ సభ్యుడు పరికి ప్రేమ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికారం చేపట్టిన కొంతకాలానికే కరోనా మూలంగా లాక్‌డౌన్‌లతో దాదాపు రెండేళ్ల పాటు పాలన మొక్కుబడిగానే సాగింది. సమావేశాలు కూడా మొక్కుబడిగా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఆశించిన మేర నిధులు రాకపోవడంతో జెడ్పీటీసీ సభ్యులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దానికితోడు ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించిన ప్రతిపాదనల్లో ఎమ్మెల్యేలు సూచించిన వాటికే ప్రాధాన్యతనివ్వడంతో జెడ్పీటీసీలు మరింత ఇబ్బందికి గురయ్యారు. ఐదేళ్ల కాలంలో పెద్దగా నిధులు రాకపోవడంతో తాము ప్రాతినిధ్యం వహించిన మండలానికి గుర్తుండిపోయే పనులు చేయలేకపోయామనే ఆవేదనతో జెడ్పీటీసీలున్నారు. చూస్తుండగానే ఐదేళ్లు గడిచిపోయిందని వారు పేర్కొంటున్నారు.

జెడ్పీటీసీలకు సన్మానం

కామారెడ్డి అర్బన్: జిల్లా పరిషత్ సభ్యుల ఐదేళ్ల పదవీ కాలం గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో గురువారం జెడ్పీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జెడ్పీ సీఈవో చందర్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్‌తో సహా జిల్లాలోని జెడ్పీటీసీలను సన్మానించారు.

భర్త ప్రోత్సాహంతోనే..

భర్త ప్రోత్సాహంతోనే ఐదేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా ముగించానని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పేర్కొన్నారు. సన్మానం అనంతరం ఆమె మాట్లాడారు. తనకు పదవి ఉన్నా లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారంలో పాలుపంచుకుంటానన్నారు. ఐదేళ్లు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ పీఠంపై భార్యాభర్తలు

- చెరో ఐదేళ్లు పాలించిన దఫేదార్ శోభ, రాజు
- ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్‌గా భర్త, కామారెడ్డి తొలి చైర్‌పర్సన్‌గా భార్య



జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, రాజు దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ సీఈవో చందర్

సాక్షి, కామారెడ్డి: సహాయ మంత్రి హోదాలో జిల్లా పరిషత్‌కు నాయకత్వం వహించే చైర్మన్ పదవి ఎంతో కీలకమైనది. జెడ్పీ సమావేశాలకు అధ్యక్షత వహించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ.. ఇలా ఎన్నో బాధ్యతలు ఉంటాయి. అలాంటి కీలకమైన పదవిని ఒకే కుటుంబం.. అదీ భార్యాభర్తలిద్దరూ చేపట్టడం అరుదు. ఆ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన దఫేదార్ శోభ, రాజు దంపతులు.

2014లో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలలో దఫేదార్ రాజు నిజాంసాగర్‌నుంచి గెలిచారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌కు చైర్మన్‌గా ఎన్నికై ఐదేళ్లు పనిచేశారు. 2019 లో జరిగిన ఎన్నికల్లో కొత్తగా ఏర్పాటైన కామారెడ్డి జిల్లా పరిషత్ పీఠం మహిళలకు రిజర్వ్ అయ్యింది. ఈసారి రాజు కుటుంబానికే అవకాశం దక్కింది. రాజు భార్య శోభ నిజాంసాగర్ జెడ్పీటీసీగా గెలిచి, జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యారు. ఐదేళ్లు పదవిలో ఉన్నారు. కాగా వరుసగా రెండు పర్యాయాలు అంటే దశాబ్ద కాలం పాటు ఒకే కుటుంబం జిల్లా పరిషత్‌ను పాలించడం గమనార్హం. హేమాహేమీలు పోటీ పడే జెడ్పీ చైర్మన్ పదవి భార్య, భర్తలు చెరో టర్మ్ పాలించే అవకాశం దక్కడంతో వారు చరిత్రకెక్కారు. వివాదాలు లేకుండానే ఇద్దరూ చెరో ఐదేళ్లు పాలించారు. కామారెడ్డి చైర్మన్‌గా దఫేదార్ శోభ పదవీ కాలం చివరలో కొంతమంది జెడ్పీటీసీలు అవిశ్వాసం పెట్టేందుకు మంతనాలు చేసినా, చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు. జిల్లా పరిషత్ సమావేశాలు కూడా చాలా వరకు సాఫీగానే జరిగాయి.

ఉన్నత పదవులపై ఆశలు...

జిల్లా పరిషత్ చైర్మన్‌గా రెండు పర్యాయాలు పనిచేసిన దఫేదార్ ఫ్యామిలీ ఉన్నత పదవుల మీద ఆశలు పెట్టుకుంది. భవిష్యత్తులో నియోజక వర్గాల పునర్విభజన జరిగితే తమ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భార్యాభర్తలిద్దరూ ఆశతో ఉన్నారు. మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తే శోభను బరిలో నిలపాలని, జనరల్ అయితే తాను ఎమ్మెల్యేగా పోటీ చేయాలని రాజు భావిస్తున్నారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్‌ను ఆ పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్లు కలిసిన సమయంలో ఆయన వారికి భవిష్యత్తు ఉంటుందన్న భరోసా ఇచ్చారు. దీంతో వారిలో మరింత ఆశలు పెరిగాయి.

క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీని గురువారం ఢిల్లీలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పామన్నారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆమెతో చర్చించినట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు 'సాక్షి'కి తెలిపారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు శ్రావ్య ఎంపిక



శ్రావ్య

కామారెడ్డి టౌన్: మాచారెడ్డి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న తగిరంచ శ్రావ్య హైదరాబాద్‌లో జరిగిన హాకీ జూనియర్ సౌత్‌జోన్ పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 10 నుంచి 17 వరకు ఆంధ్ర ప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో శ్రావ్య ఆడనున్నట్లు కామారెడ్డి హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీల లింగం గురువారం తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు..





యాట విగ్నేష్ గంగమణి

బాన్సువాడ : బాసర ట్రిపుల్ ఐటీకి బీర్కూర్‌కు చెందిన యాట విగ్నేష్ ఎంపికయ్యాడు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విగ్నేష్‌కు 10 జీపీఏ వచ్చింది. దీంతో బాసర్ ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకున్నాడు. ఉన్నతాధికారులు విడుదల చేసిన మొదటి జాబితాలో విగ్నేష్‌కు ఓపెన్ కేటగిరిలో సీటు లభించింది.

పిట్లం నుంచి..


పిట్లం(జుక్కల్) : మండలంలోని చిల్లర్గి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గంగమణి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం హరిసింగ్ పేర్కొన్నారు. పదో తరగతిలో 9.8 గ్రేడ్ సాధించి మండల టాపర్‌గా నిలిచిన గంగమణికి ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చిందన్నారు.

మన్యంవీరా మన్నించు..



బాన్సువాడ రూరల్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని జిల్లావ్యాప్తంగా గురువారం జరుపుకోగా బాన్సువాడలోని హన్మాజీపేట్‌లో ఆయన వర్ధంతిని ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు తదితరులు మరిచినట్లయ్యింది. నక్సలిజం సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న సమయంలో హన్మాజీపేట్‌లో నాటి 'అన్న'లు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామంలోని అల్లూరి విగ్రహం నిరాధరణకు గురవుతోంది.

సీజనల్ టెన్షన్..!



- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- మండలంలో ఇప్పటి వరకు 50కి పైగా ఫీవర్ కేసుల నమోదు
- భయపెడుతున్న డెంగీ, మలేరియా

రాజంపేట: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల ప్రభావం భారీగా ఉండే అవకాశం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జ్వర బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అపరిశుభ్రంగా ఉంటే జ్వరంతోపాటు డెంగీ, మలేరియా వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. అన్ని ప్రాథమిక కేంద్రాలతోపాటు అర్బన్, ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలని ఆదేశించడంతో సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జనాల్లో అవగాహన కలిగించడంతోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది దోమలను నియంత్రించేందుకు విధిగా ఫాగింగ్ చేయాలని వారు కోరుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 50కి పైగా ఫీవర్ కేసులు నమోదయ్యాయని రాజంపేట వైద్యులు విజయ మహాలక్ష్మి తెలిపారు. జూలై, ఆగస్టులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి రోజూ చికిత్స కోసం వచ్చేవారికి అవసరమైన మందులను వైద్యాధికారులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అయితే రానున్న రోజుల్లో ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తు న్నారు.

దోమల నియంత్రణకు..

దోమల కారణంగా మలేరియా, డెంగీ వ్యాధులు పెరుగుతుంటాయి. వీటి బారిన పడకుండా దోమల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఇంట్లో దుమ్ము ధూళి, పాత సామగ్రిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టూ పూల కుండీలు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎక్కడపడితే అక్కడ నీరు తాగడం మంచిది కాదు. బయట ఆహారానికి దూరంగా ఉండడమే మేలు. కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగడం మంచిది. మూడు రోజుల కంటే జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, ఇతర సమస్యలు వేధిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాల కారణంగా నీటి నిల్వలతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు మా పీహెచ్‌సీ పరిధిలో ఎలాంటి డెంగీ కేసులు నమోదు కాలేదు. కానీ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి.

–విజయ మహాలక్ష్మి, వైద్యులు, రాజంపేట

డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలు

- రోడ్లపై ప్రవహిస్తున్న మురికినీరు
- శుభ్రం చేయడంలో కార్మికులకు ఇబ్బందులు



డ్రెయినేజీని ఆక్రమించి కొనసాగుతున్న వ్యాపారం

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. దుకాణాల యజమానులు తమ దుకాణాల ముందున్న డ్రైనేజీలపై నిర్మాణాలు చేపడుతుండటంతో కార్మికులు డ్రైనేజీలు శుభ్రం చేయడానికి వీలులేకుండా పోయింది. దీంతో మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంది. బాన్సువాడ మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. తాడ్కోల్ చౌరస్తా నుంచి మహేశ్వరి టాకీస్ వరకు డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. తాడ్కోల్ చౌరస్తా నుంచి టీచర్స్ కాలనీ రోడ్డు వరకు డ్రైనేజీ సక్రమంగా నిర్మించకపోవడంతో వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో ఈ ప్రధాన రహదారి వెంట వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో డ్రైనేజీని శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఉంది. అక్కడక్కడ ఉన్న మ్యాన్‌హోల్ లోపలికి వెళ్లి కార్మికులు డ్రైనేజీని శుభ్రం చేసే క్రమంలో ఊపిరి ఆడకుండా ఇబ్బందులు పడుతున్నారు. తాడ్కోల్ చౌరస్తా నుంచి బీసీ హాస్టల్ రోడ్డు వరకు ఇరువైపులా వ్యాపారులు డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రోడ్డుపైనే వ్యాపారులు చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది పలుమార్లు నోటీసులిచ్చినా బెదరడం లేదు. వ్యాపారులు మున్సిపాలిటీకి ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా చూపించాల్సిన అవసరముంది.

కాంగ్రెస్ నేతల ఫొటోలు తొలగించాలి



ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

భిక్కనూరు: ప్రోటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా ఎంపీపీ చాంబర్‌లో కాంగ్రెస్ నేతల ఫొటోలు పెట్టారని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. వివరాలు.. మాజీ ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి తన చాంబర్‌లో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఫొటోలను ఆరు నెలల క్రితం గోడపై ఏర్పాటు చేసుకున్నారు. అలాగే మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి హాజరైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని స్వాగతిస్తూ కాంగ్రెస్ ఎంపీటీసీ ఫ్లెక్సీని ఏర్పాటు ఏశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. వెంటనే ఫ్లెక్సీని, ఫొటోలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీని, ఫొటోలను తొలగించడంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఇకమీదట ఇలాంటి ఘటన జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనిత మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఇస్తామన్న రూ.2500ను ప్రతి మహిళకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివాహం చేసుకున్న ఆడపిల్లలకు ఇస్తామన్న తులం బంగారం, 18 ఏళ్లు నిండిన కళాశాల విద్యార్థినులకు స్కూటీ ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నాయకులు బాలమణి, వరలక్ష్మి, కర్రోళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని వినతి



కామారెడ్డి టౌన్: భిక్కనూరు ఎంపీడీవోపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు గురువారం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీడీవో కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, షబ్బీర్‌అలీల ఫొటోలు పెట్టారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. భిక్కనూరు, కామారెడ్డి మండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌కు 14 మంది ఎంపిక



జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్/భిక్కనూరు/మాచారెడ్డి: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిడ్స్ అండర్–8, 10, 12 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలకు భారీ స్పందన లభించింది. దాదాపు 280 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా వీరిలో అత్యంత ప్రతిభ చూపిన 14 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి గోపిచంద్ అకాడమీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌లో వీరు పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. వివిధ అంశాల్లో పాల్గొన్న ప్రతిభావంతులకు సర్టిఫికెట్లను అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..

ఎ.రేహాన్ష్ గౌడ్, ఎం.రాధ్య, జే.ఆద్యా, వై.శైలజ, ఎ.భార్గవ్‌రెడ్డి, ఎం.విరాట్, జి.మధుప్రియ, డి.విహాన్‌రెడ్డి, వై.సుమిత్ర, ఎం.శౌర్యచక్ర, డి.రాహుల్, సీహెచ్.స్పందన, సీహెచ్.నిహారిక, ఎం.పవిత్ర ఎంపికయ్యారు.

విద్యార్థి నాయకుల అరెస్ట్



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నేడు జరుగనున్న చలో టీజీపీఎస్‌సీ శాంతియుత ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న విద్యార్థిసంఘం నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట భాస్కర్ మాట్లాడుతూ గ్రూప్–2,–3 పోస్టులు పెంచాలని, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలన్నారు. అక్టోబర్‌లో మెగా డీఎస్సీ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



సీఐతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై గురువారం సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాతతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రి ముందు బారికేడ్ల ఏర్పాటు వల్ల ఒకటే యూటర్న్ ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సీఐతో చర్చించారు. రెండు రోజుల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం చూపాలని సీఐని కోరారు. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీ బంద్ ఉద్రిక్తం



వర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తెయూ(డిచ్‌పల్లి): నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నిందితులను శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం చేపట్టిన తెలంగాణ యూనివర్సిటీ బంద్ ఉద్రిక్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నీట్ విద్యార్థులకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీ తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఎన్‌టీఏను వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ చేయించి, 24 లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి పోలీసులు వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లోకి ప్రవేశించి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. వారు మొరాయించడంతో ఈడ్చుకుంటూ తీసుకెళ్లి జీపులో బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కర్క గణేశ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు దినేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తా



షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్

భిక్కనూరు: అభివృద్ధి పనులకు త్వరగా నిధులు మంజూరు చేయిస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం భిక్కనూరు మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, షబ్బీర్‌అలీని కలిసి కాచాపూర్ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం షబ్బీర్ అలీని సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. పదేళ్లుగా ప్రజల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని తనకు తెలియజేస్తే నిధులను మంజూరు చేయిస్తానని అన్నారు. కాంగ్రెస్ నేతలు బైండ్ల దశరథం, వెంకటస్వామి, అమృత్‌రావు, శ్రీధర్, ఊడెం గాలిరెడ్డి, మోతే నర్సింహంరెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్యలు ఉన్నారు.

పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబీస్ టీకా

కామారెడ్డి టౌన్: ఈ నెల 6న జునోసిస్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డిలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటి రేబీస్ టీకాను ఉచితంగా వేయనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి గురువారం తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించేలా ఆదేశాలు ఇవ్వండి

- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



స్పీకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. స్పీకర్‌ను గురువారం ఆయన హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. అధికార పార్టీ నేతలకే మాత్రమే ప్రొటోకాల్ పాటిస్తున్నారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం ఇచ్చే తెలంగాణ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించాలని కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సురేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని కొట్టాల్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండలం ఎక్కపల్లికి చెందిన బాలమోల సురేశ్(30) గ్రామం నుంచి ఎల్లారెడ్డికి బైక్‌పై వస్తుండగా.. సూర్యప్రకాశ్(28), అనోఖ్(27) ఎల్లారెడ్డి నుంచి లింగంపేట మండలం భవానిపేట వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈక్రమంలో రెండు బైక్‌లు కొట్టాల్ శివారులో ఢీకొన్నాయి. ఈ ఘటనలో సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన ఇద్దరిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సూర్యప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో..



పరమేశ్వర్ (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామ శివారులోని వ్యవసాయభూమిలో విద్యుత్ షాక్‌తో గౌరారం గ్రామానికి చెందిన ఓడిగె పరమేశ్వర్(38) మృతి చెందాడు. గురువారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తూ జీవించే పరమేశ్వర్ గ్రామశివారులో పని చేస్తుండగా 11కేవీ హ్యాండిల్ తగిలి మృతి చెందాడు. పరమేశ్వర్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని నల్లవెల్లి, గౌరారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

పాముకాటుతో మహిళ ..



గంగామణి(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లారకు చెందిన ఔటి గంగామణి (44) పాముకాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి పాముకాటువేయడంతో గంగామణిని కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిందన్నారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారని, భర్త ఏడాది క్రితం గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. గంగామణి మృతితో పిల్లలు అనాథలయ్యారని గ్రామస్తులు అన్నారు.

చికిత్స పొందుతూ..



షరీఫ్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పడకల్‌కు చెందిన మహ్మద్ షరీఫ్(52) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షరీఫ్ గత నెల 26వ తేదీన పెట్రోల్ బంక్‌కు వెళ్లి నడుచుంటూ ఇంటికి తిరిగివస్తుండగా కలిగోట్ నుంచి జక్రాన్‌పల్లి వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో షరీఫ్ తలకు బలమైన గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. ఐదు రోజులపాటు ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. గురువారం ఉదయం షరీఫ్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

మల్లారం అటవీప్రాంతంలో..

వర్ని: మండలంలోని మల్లారం అటవీ ప్రాంతంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో మహ్మదాబాద్‌కు చెందిన పంచాల నరేందర్(30) మృతి చెందాడు. సాయిచరణ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తి కిరణ్‌కు సైతం గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో నిజామాబాద్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఆంధ్రనగర్‌లో పేకాటస్థావరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం, సిబ్బంది గజేందర్, అనిల్, నర్సన్న పేకాటస్థావరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24,420 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నందిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఇసుక లారీల పట్టివేత



పిట్లం(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను మండల కేంద్రం శివారులో పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. బిచ్కుంద మండలం హస్గుల్ శివారులోని మంజీరా వాగు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రెండు లారీలను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో బుధవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ద్యాగ సుధాకర్ బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లాడు. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలోని రూ.20వేల నగదుతోపాటు తులం బంగారు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు. అలాగే పక్కనే ఉన్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లో సైతం దుండగులు చోరీకి పాల్పడ్డారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కసుకంటి కవిత ఇంట్లో బుధవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కసుకంటి కవిత బుధవారం తన ఇంటికి తాళం వేసి మండలంలోని ముదెల్లిలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తాళం పగుల గొట్టి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వా రు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకున్న కవిత.. దుండగులు బీరువాను ధ్వంసం చేసి అందులో దాచి ఉంచిన బంగారం, వెండి నగలతోపాటు కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడలో నుంచి బంగారుగుండ్లు అపహరణ



బాధితురాలు సాయవ్వ

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ మెడలో నుంచి దుండగుడు బంగారు గుండ్లను లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జుక్కల్ మండలం పెద్దఏడ్గి గ్రామానికి చెందిన సాయవ్వ బిచ్కుందలోని బంధువుల ఇంటికి వచ్చింది. బుధవారం పెద్దఏడ్గికి తిరిగి వెళ్లేందుకు బస్టాండ్‌లో ఔరాద్ బస్సు ఎక్కుతుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు అరతులం బంగారు గుండ్లను తెంపుకొని పారిపోయాడు. బాధితురాలు గురువారం కొడుకుతో కలిసి వచ్చిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వారు సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.